క్లుప్తంగా

ఆడుదాం ఆంధ్రలో బాలికల ప్రతిభ

రాజుపాళెం : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పోటీల్లో నియోజకవర్గస్థాయిలో మొదటి, రెండో స్థానాల్లో వెల్లాల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు నిలిచినట్లు ప్రిన్సిపాల్ తులశమ్మ తెలిపారు. పాఠశాలలో బుధవారం ప్రిన్సిపాల్ విలేకరులతో మాట్లాడుతూ తమ విద్యార్థినులు వాలీబాల్‌లో మొదటి స్థానం, కబడ్డీలో రెండో స్థానంలో నిలిచారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థినులకు రూ.35వేలు క్యాష్ అవార్డు వారి ఖాతాల్లో జమ చేశారని, ప్రశంసా పత్రాలు అందించారని తెలిపారు. గెలిచిన బాలికలకు ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ అభినందించారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంపు

ప్రొద్దుటూరు : మండలంలోని చౌటపల్లెలో ఎస్‌సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపు బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ వారం రోజులుగా గ్రామంలో వలంటీర్లు స్పెషల్ క్యాంపులో భాగంగా ఎయిడ్స్‌పై ర్యాలీ, మొక్కలు నాటడం, ఆరోగ్యం, పరిశుభ్రత, నిరుద్యోగంపై ఇంటింటి సర్వే నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మార్తల లక్ష్మీసునీత పాల్గొన్నారు.

నేడు రాజుపాళెంలో వైఎస్సార్ ఆసరా

రాజుపాళెం : మండల కేంద్రమైన రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం జయరాజ్ బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి హాజరవుతున్నారని, మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజుపాళెం : మండలంలోని వెల్లాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఇంగ్లీషు మాధ్యమంలో 2024–25 సంవత్సరంలో ప్రవేశాలకు బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తులశమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9440534509 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

టెట్, డీఎస్సీ ఒకేసారి నిర్వహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఎన్నికలకు ముందే టెట్, డీఎస్సీ పరీక్షలు ఒకే సారి నిర్వహించి ఫలితాలు విడుదల చేయాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు తెలిపారు. బుధవారం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డికి ఈ మేరకు వినతి పత్రం ఇచ్చారు.

రేపు 'వైఎస్సార్ ఆసరా'

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని స్త్రీ శక్తి భవనం ఆవరణలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు డ్వాక్రా మహిళా సంఘాలకు అందజేస్తారని ఏపీఎం వీరాంజనేయులు తెలిపారు. కార్యక్రమానికి మహిళా సంఘాల లీడర్లు, సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

గోపవరం : మండలంలోని బుచ్చనపల్లె గ్రామానికి సమీపంలో కొలువైన శ్రీ షిరిడిసాయినాథుని ఆలయ 4వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వార్షికోత్సవంలో పాల్గొననున్నారు. ఆలయ ధర్మకర్త కూకట్లపల్లి నారాయణ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. భక్తులు పాల్గొని వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పోరుమామిళ్ల : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని సగిలేరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్ వరప్రసాద్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 23వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని, మార్చి 10న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు సగిలేరు గురుకుల పాఠశాలలో సంప్రదించాలన్నారు.

గడ్డివాములు దగ్ధం

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామంలో వెలవలి గ్రామానికి వెళ్లే రహదారిలో బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు నాలుగు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. వాటి విలువ దాదాపు రూ.2 లక్షలు పైనే అవుతుందని బాధిత రైతులు తెలిపారు. విషయం గ్రామస్తులకు తెలియడంతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న ప్రొద్దుటూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే బడుగుల అభివృద్ధి



పోరుమామిళ్ల : వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు



ప్రొద్దుటూరు : మహిళలకు మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

బి.కోడూరు : రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి చెందారని, వారు మరింత అభివృద్ధి చెందాలంటే తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్నే గెలిపించాలని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు కోరారు. బుధవారం మండలంలోని పెద్దుళ్లపల్లె, మేకవారిపల్లె గ్రామ పంచాయతీల పరిధిలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నూతన భవనాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలకు పాలన మరింత చేరువై మరింత అభివృద్ధి చెందేందుకు ప్రతి గ్రామ పంచాయతీకి సుమారు రూ.కోటి ఖర్చు చేసి నూతన సచివాలయ భవనాలను నిర్మించామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ నాగరాజు, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ దావీదు, ఎంపీపీ కోడూరుచెన్నమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, సర్పంచ్‌లు పీరయ్య, పెద్దిరెడ్డిరమణమ్మ, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్లు రాజగోపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఉప సర్పంచ్ శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, సుబ్బిరెడ్డి, రమణారెడ్డి, నరసింహారెడ్డి, ప్రహల్లాదరెడ్డి, ఆదిత్యరెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు అత్యంత ప్రాధాన్యత

పోరుమామిళ్ల : డ్వాక్రా మహిళలకు, గ్రామ సంఘాలకు జగనన్న పాలనలోనే ప్రయోజనం జరిగిందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం జూనియర్ కళాశాల మైదానంలో వైస్ ఎంపీపీ సీఎం బాషా అధ్యక్షతన ఏర్పాటు చేసిన వైఎస్సార్ 4వ విడత కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం మహిళలకు మెగా చెక్కును అందించారు.

పీఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ చెన్ను రాజశేఖర్, సచివాలయాల కన్వీనర్ కె.రమణారెడ్డి, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఆనందయ్య మాట్లాడారు. సమావేశంలో డీఆర్‌డీఏ అధికారులు, స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ వరప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకోండి

ప్రొద్దుటూరు : మీతోపాటు మీ బిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని రిషి అపార్ట్‌మెంట్ వద్ద బుధవారం 1, 35, 36, 37, 38, 39, 40, 41 వార్డులకు సంబంధించి వైఎస్సార్ ఆసరా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సరైన నాయకులకు ఓటు వేయకుంటే మీ బిడ్డల భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. మీతోపాటు మీ బిడ్డల భవిష్యత్తు గురించి ఏ ప్రభుత్వం ఆలోచించింది, ఎవరు హామీలు ఇచ్చి అమలు చేశారో ఆలోచించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, మెప్మా టీఈ కెజియా జాస్లిన్, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సాయంత్రం మండల పరిధిలో..

సాయంత్రం ప్రొద్దుటూరు మండలంలోని డ్వాక్రా మహిళలతో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ ఆసరా సభ నిర్వహించారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని 405 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.3,06,33,098 మెగా చెక్కును ఎమ్మెల్యే రాచమల్లు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, ఏపీఎం వెంకటసుబ్బమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

వ్యవసాయంలో రాణించాలి

చాపాడు : వైఎస్సార్ క్రాంతి పథం స్వయం సహాయక సంఘాలలోని మహిళలు వ్యవసాయంలో రాణించేలా మండల కమిటీ సభ్యులు కృషి చేయాలని జిల్లా రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏపీఎం రెడ్డయ్య తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో బుధవారం రైతు ఉత్పత్తిదారుల సంస్థ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలుగా మడూరుకు చెందిన ఎస్.వరలక్ష్మీ, ఉపాధ్యక్షురాలుగా వెదురూరుకు చెందిన లక్ష్మీజ్యోతి, ఉప కార్యదర్శిగా బద్రిపల్లెకు చెందిన జి.నాగేశ్వరమ్మ, కార్యదర్శిగా చిన్నగురువళూరుకు చెందిన సుశీలమ్మ, కోశాధికారిగా పెద్దగురువళూరుకు చెందిన నాగరాజేశ్వరిలను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ మద్దతు ధరలకు జొన్న విక్రయించాలి

చాపాడు : జొన్న పంటను సాగు చేసిన రైతులు ప్రభుత్వ మద్దతు ధరలకు విక్రయించుకోవాలని రాష్ట్ర ఉద్యానశాఖ ప్రభుత్వ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చియ్యపాడు, చిన్నగురువళూరు, ఎస్.ఓబాయపల్లె, అన్నవరం గ్రామాలలో జొన్న పంటను పండించిన రైతులతో మండల వ్యవసాయ అధికారి మ్యాగీతో కలసి ఆయన రైతులతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం క్వింటా జొన్నకు రూ.3180లు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

డబ్బు లేకుండా ఎన్నికల్లో పోటీకి సిద్ధమా..?

టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కు సవాల్ విసిరిన ఎమ్మెల్యే రాచమల్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : త్వరలో జరగనున్న ఎన్నికల్లో డబ్బు లేకుండా పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, అందుకు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి సిద్ధమేనా అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సవాల్ విసిరారు. స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ ఛాంబర్‌లో బుధవారం ఆయన విలేకరులో మాట్లాడుతూ ప్రవీణ్ చేసిన వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించారు. ఎన్నికల్లో ప్రతి ఓటరుకు ఎమ్మెల్యే రూ.10 వేలు నగదు ఇస్తారని ప్రవీణ్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. తన ఆస్తి విలువ ప్రకారం తాను రూ.10వేలు ఇస్తే, ప్రవీణ్‌కు ఉన్న ఆస్తి ప్రకారం ప్రతి ఓటుకు రూ.20వేలు డబ్బు ఇచ్చే శక్తి ఉందన్నారు. ఎన్నికలకు అతీతంగా చాలా ఏళ్లుగా తాను మానవతా హృదయంతో పేదలకు ఆర్థిక సహాయం చేయడంతోపాటు, సేవ చేస్తున్నానన్నారు. ప్రవీణ్‌కు చిత్తశుద్ధి ఉంటే, ప్రజలకు మేలు చేయాలని ఆసక్తి ఉన్నా రూ.50 నుంచి రూ.90 కోట్లు ప్రజలకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రవీణ్ సిద్ధపడితే తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. ప్రవీణ్ కుటుంబం ఏ నాడు ప్రజలకు సేవ చేసిన పాపాన పోలేదన్నారు. వ్యక్తిగత ఆరోపణలు మానుకొని చేతనైన సహాయం చేయాలని హితవు పలికారు.

కార్పొరేట్ సంస్థలపై ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాం..

కార్పొరేట్ సంస్థల రాకతో మా ఊరు వ్యాపారస్తులకు జరుగుతున్న నష్టంపై ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నామని ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అనంతరం వివరాలను మీడియాకు వెల్లడించారు. మార్కెట్ వేలం పాట రూ.1.33 కోట్లు మాత్రమే పలకడంతో మున్సిపల్ ఆదాయాన్ని మరింత పెంచేందుకు వాయిదా వేశామన్నారు. స్థానిక వస్త్రవ్యాపారులు కార్పొరేట్ సంస్థల వల్ల నష్టపోతున్నామని విన్నవించడంతో చిన్న చిన్న పట్టణాల్లో కార్పొరేట్ సంస్థలు రాకుండా ఉండేందుకు ప్రభుత్వానికి కౌన్సిల్‌లో తీర్మానం చేసి పంపుతున్నామన్నారు. సీఎంఆర్ షాపింగ్ మాల్‌కు ట్రేడ్ లైసెన్స్ ఎలా ఇచ్చారని ప్రవీణ్ మాట్లాడుతున్నారన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లకు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి సంబంధం ఉండదన్నారు. ప్రవీణ్‌కు చెందిన వీరభద్ర బార్ అండ్ రెస్టారెంట్‌కు కూడా మున్సిపాలిటీ ట్రేడ్ లైసెన్స్ ఇచ్చిందన్నారు. వ్యాపారులు ఎవరు దరఖాస్తు చేసుకున్నా లైసెన్స్ ఇస్తారని, దానికి ఎవరి రెకమెండేషన్ అవసరం లేదన్నారు. కోగటం నాయకులు అధికారంలోకి వస్తే గీత గీసి పన్ను రాబడుతారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే బుశెట్టి కుటుంబీకులు సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను నిర్మించారని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

బ్రహ్మంగారిమఠం : మండలంలో రెవెన్యూ పరంగా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక రెవెన్యూ సదస్సు ఉంటుందని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి బద్వేల్ ఆర్డీఓ ఆవుల వెంకటరమణ, ఎమ్మెల్యే, ఇతర అధికారులు వస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు రెవెన్యూ సమస్యలు ఉంటే అర్జీ రూపంలో వినతి పత్రాలు ఇవ్వాలన్నారు.

అలాగే నూతన సచివాలయాలు, ఆర్బీకేలు ప్రారంభం

మండలంలో తోట్లపల్లె ఆర్బీకే, నరసన్నపల్లె, సోమిరెడ్డిపల్లె గ్రామ సచివాలయాలు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి గురువారం ప్రారంభిస్తారన్నారు. అలాగే నరసన్నపల్లె దగ్గర ప్రభుత్వం ఇచ్చిన భూములను పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొనాలన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

చాపాడు : యువత బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు పొందాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ పి.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. చాపాడులోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ సమీపంలో ఏర్పాటు చేసిన కీర్తన్ ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రొగ్రెసివ్ ఫౌండేషన్ చైర్మన్ చాపాటి రామసుధాకర్‌రెడ్డి బ్యాంకు మేనేజర్‌తో కలసి ప్రారంభించారు. యూనియన్ బ్యాంకు ఆర్థిక సహకారంతో రూ.10లక్షలతో అధునాతన వాటర్ ప్యూరిఫైడ్ ప్లాంట్‌ను కీర్తి అనే మహిళ నెలకొల్పారు. మహిళలు ముందుకు వచ్చి ఇలాంటి ప్లాంటు ఏర్పాటు చేయడం వల్ల స్వయం ఉపాధితోపాటు మహిళ అభ్యున్నతికి, ఆత్మస్థైర్యానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ విజయ్‌కుమార్, ప్లాంట్ నిర్వాహకులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం



కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్

బద్వేలు అర్బన్ : స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ గతేడాది నవంబర్‌లో గుండెపోటుతో మృతి చెందిన గొల్లపల్లె భాగ్యరాజు (పీసీ 2786) కుటుంబానికి బుధవారం స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందించారు. బి.మఠం మండలం పెద్దిరాజుపల్లె గ్రామానికి చెందిన భాగ్యరాజు 2011లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాడు. ఈయనకు భార్య వసుంధరతోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అకస్మాత్తుగా కానిస్టేబుల్ మృతిచెందడంతో స్పందించిన అర్బన్ సీఐ పి.యుగంధర్ తోటి సిబ్బందితో మాట్లాడి ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో సిబ్బంది సహకారంతో సమకూర్చిన రూ.2 లక్షల నగదును పిల్లల పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి సంబంధిత పత్రాలను కానిస్టేబుల్ భార్యకు అందజేశారు. అలాగే పోలీసుశాఖ తరఫున రావాల్సిన ఇతర సదుపాయాలను కూడా త్వరితగతిన అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భర్తను కోల్పోయి కష్టాల్లో ఉన్న తనకు ఆర్థిక సహాయం అందజేసిన సీఐ, ఎస్ఐ, సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ విక్రమసింహ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

ప్రొద్దుటూరు : స్థానిక 39వ వార్డు హనుమాన్ నగర్ కోతి సమాధి వద్ద బుధవారం రూ.15 లక్షల అంచనాతో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు. అలాగే జమ్మలమడుగు రోడ్డు వైఎస్సార్ సర్కిల్ వద్ద నుండి చౌటపల్లెకు వెళ్లేందుకు రూ.20 లక్షల అంచనాతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్ అనిల్‌కుమార్, చౌటపల్లె సర్పంచ్ మార్తల లక్ష్మీసునీత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మండల ప్రెసిడెంట్ మార్తల ఓబుళరెడ్డి, దొరసానిపల్లె ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



స్కూల్ బస్సు డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎంవీఐ శేఖర్‌రావు

బద్వేలు అర్బన్ : స్కూల్ బస్సు డ్రైవర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని బద్వేలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఎంవీఐ కార్యాలయ ఆవరణలో స్కూల్ బస్సుల డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి స్కూల్ బస్సుకు తప్పనిసరిగా సహాయకుడు ఉండాలని తెలిపారు. అలాగే స్కూల్ బస్సుల డ్రైవర్లు లైసెన్స్ పొంది 5 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని సూచించారు. వాహన కెపాసిటికి మించి విద్యార్థులను ఎక్కించరాదని హెచ్చరించారు. అలాగే ప్రతి స్కూల్ బస్సుకు తప్పనిసరిగా అత్యవసర ద్వారం ఏర్పాటు చేయడంతోపాటు సెంటర్, సైడ్ అద్దాలు ఉండాలని కోరారు. అంతేకాకుండా బస్సులో అగ్నిప్రమాద నిరోధక యంత్రాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పనిసరిగా ఉంచాలని కోరారు. అనంతరం ఫైర్ సిబ్బందితో అగ్నిప్రమాద నిరోధక యంత్రాలు ఎలా ఉపయోగించాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల స్కూల్ బస్ డ్రైవర్లు, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

కలసపాడు : మండలంలోని లింగారెడ్డిపల్లెలో బుధవారం మదర్ థెరిసా ఫౌండేషన్ బ్రియాన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్‌థెరిసా ఫౌండేషన్ బ్రియాన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ జనరల్ మేనేజర్ గిరిప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ కాశినాయన, కలసపాడు, బి.కోడూరు, పోరుమామిళ్ల మండలాల్లోని ప్రజలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఆయాసం, ఒంటి నొప్పులు, కీళ్ల నొప్పులు, గ్యాస్ట్రబుల్ ఉన్న 150 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సెయింట్ ఆంటోనీస్ పాఠశాల కరస్పాండెంట్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి, హాస్పిటల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : ప్రతి ఒక్కరూ చిన్నారుల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ పేర్కొన్నారు. స్థానిక సుమిత్రా నగర్‌లోని షాలోమ్ అనాథ శరణాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ బాలల హక్కులకు భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ముఖ్యంగా బాలల అక్రమ రవాణా నిరోధానికి అందరూ కృషి చేయాలన్నారు. పిల్లలు కష్టపడి చదివి మంచి ప్రయోజకులుగా తయారు కావాలని కోరారు. అనంతరం అనాథ శరణాలయంలో వసతులను పరిశీలించి నిర్వాహకులకు సూచనలిచ్చారు. అలాగే చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనాథ శరణాలయం నిర్వాహకురాలు దేవసుధ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేల కృషితోనే నీటి విడుదల

ప్రొద్దుటూరు : సకాలంలో కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేసి పంటలను సంరక్షించినందుకు వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరిరెడ్డి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ అధ్యక్షతన ప్రొద్దుటూరు మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసం దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ నీరు విడుదల చేయించడమేగాకుండా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రత్యేక చొరవ చూపి కాలువల వెంబడి తిరిగారన్నారు. కాలువలో జంబును తొలగించి నీరు వేగంగా వచ్చేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇప్పటికీ కాలువలో నీరు ప్రవహిస్తోందన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

